ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025



మలి విడత పోరు ఫైనల్



- రెండో విడతలో పోటీలో 279 సర్పంచ్, 1342వార్డు అభ్యర్థులు
- 11 సర్పంచ్‌లు, 228 వార్డు సభ్యుల ఏకగ్రీవం
- జిల్లాలో జోరందుకుంటున్న ప్రచారం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పల్లె ఎన్నికల సంగ్రామం ఊపందుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడత అభ్యర్థులు ఇప్పటికే ప్రచారంలో బిజీబిజీగా ఉన్నారు. రెండో విడత నామి నేషన్లు ఉపసంహరణ ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసింది. మలి విడత అభ్యర్థుల లెక్క తేలడంతో ప్రచారం ఊపందుకోనున్నది. మరోవైపు తుది విడత నామినేషన్లు ముగియడంతో ఉపసంహరణల గడువు 9 వ తేదీ వరకు ఉండడంతో పోటీలో ఉన్న అభ్యర్థులను బుజ్జగింపులు, ఒత్తిళ్లతో ఉపసంహరణకు పార్టీల నేతలు, పలుకుబడి వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మొదటి, రెండు విడతల్లో నామి నేషన్ల ముగిసి గుర్తులు కేటాయించడంతో ప్రచార సందడి తో గ్రామాలు కోలాహలంగా మారాయి. మొదటి విడతలో 295 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1377 మంది వార్డు అభ్యర్థులు బరిలో ఉండగా రెండో విడతలో 279 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1342 మంది వార్డు అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడో విడతలో నామినేషన్ల పరిశీలన తరువాత 514 మంది సర్పంచ్ అభ్యర్థులు,1834 మంది వార్డు అభ్యర్థులు ఉన్నారు.

జిల్లాలో 27 సర్పంచ్‌లు ఏకగ్రీవం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామ పంచాయతీల్లో తొలి, మలి విడతలతో పాటు కొనసాగుతున్న మూడో విడతలో కలిపి 27 మంది సర్పంచులు, 2268 వార్డు స్థానాల్లో 295 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. తొలి విడతలో ఐదు మండలాల్లో 85 సర్పంచ్ స్థానాల్లో 9 మంది సర్పంచులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. రుద్రంగి మండలంలో 10 గ్రామపంచాయతీలు ఉండగా గిరిజన తండాల్లో ఏడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రెండో విడతలో 88 సర్పంచ్ స్థానాల్లో 11 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 758 వార్డుల్లో 182 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. తుది విడతలు 87 పంచాయతీలు, 762 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు ఉపసంహారులు ఈనెల 9 తేదీ వరకు గడువు ఉంది. నామినేషన్లు ఉపసంహరణ వరకు 11 సర్పంచి స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

జిల్లాలో ఇప్పటివరకు మొదటి విడతలో ఏకగ్రీవ సర్పంచులో రుద్రంగి మండలంలో అడ్డబోరు తండ సర్పంచ్‌గా గూగులోతు మంజుల, గైదీగుట్ట తండా సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్, వీరునితండా సర్పంచ్‌గా గుగులోతు మంజుల, చింతామణితండా సర్పంచిగా గుగులోతు సింధుజ, బడితండా సర్పంచ్‌గా మాలోతు రాందాస్, రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్, సర్పంచ్ తండా సర్పంచ్‌గా మాలోత్ రజితలతో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోనరా వుపేట మండలంలో ఊరుతండా సర్పంచ్‌గా ఇస్లావత్ మంజుల, కుమ్మరిపేట తండా సర్పంచ్‌గా మాలోతు మంజులలు వార్డు సభ్యులతో సహా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో విడతలో తంగళ్ళ పల్లి మండలం వేణుగోపాల్ పూర్ సర్పంచ్‌గా జూపల్లి రమాదేవి, ఉపసర్పంచ్‌గా లింగంపల్లి

మిగతా 8లో

తొలి విడత బరిలో ...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి విడతలో ఐదు మండలాల్లో 85 సర్పంచ్ స్థానాలు ఉండగా తొమ్మిది స్థానాల్లో ఏకగ్రీవం కాగా 76 గ్రామపంచాయతీలు 295 మంది సర్పంచ్ అభ్యర్థులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా 519 వార్డుల్లో 1377 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మండలం	సర్పంచ్	వార్డులు
రుద్రంగి	10	91
వేములవాడ	47	218
వేములవాడ రూరల్	52	262
కోనరావుపేట	122	459
చందుర్తి	64	347
మొత్తం	295	1377

రెండో విడతలో ...

రెండో విడతలో శనివారం నామినేషన్ల ఉపసంహర ణలు ప్రశాతంగా ముగిశాయి. మూడు మండలాల్లో 88 సర్పంచులు, 758 వార్డు సభ్యుల స్థానాలకు ఉండగా సర్పంచ్ స్థానాల్లో 11 మంది అభ్యర్థులు, 182 మంది వార్డు అభ్యర్థులు ఏకగ్రీవం కాగా సర్పంచ్ అభ్యర్థులు 279 మంది, 1342 వార్డు అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మండలం	సర్పంచ్	వార్డులు
బోయిన్‌పల్లి	90	437
ఇల్లంతకుంట	79	454
తంగళ్లపల్లి	110	451
మొత్తం	279	1296

మూడో విడతలో ...

మూడో విడత ఎన్నికల సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ల పర్వం ముగిసింది.. నా లుగు మండలాల్లో 87 సర్పంచులు, 762 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. శనివారం నామినేషన్ల పరిశీలన జరిపారు. మిగిలిన నామినేషన్లలో సర్పంచ్ స్థానాలకు 514 నామినేషన్లు, 1834 వార్డు సభ్యుల స్థానా లకు నామినేషన్లు వచ్చాయి. ఈ నెల 9వ తేదీ వరకు ఉపసంహరణలకు గడువు ఉంది.

మండలం	సర్పంచ్	వార్డులు
ఎల్లారెడ్డిపేట	142	542
వీర్నపల్లి	86	219
ముస్తాబాద్	170	545
గంభీరావుపేట	116	528
మొత్తం	514	1834

వేములవాడ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత నోటిఫికేషన్ విడుదల చేశారు. వేములవాడ బార్ అసోసియేషన్‌లో ఏడు సంవత్సరాల సీనియారిటీ కలిగి ఉన్న న్యాయవాదులు తమ ధ్రువపత్రాలతో ఈ నెల 24వ తేదీలోపు వేములవాడ సబ్ కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోనరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్ శనివారం పరిశీలించారు. కోనరావుపేట మండలంలోని కొలనూరు, మర్తనపేటలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో స్నిగ్ధ రెడ్డి తదితరులు ఉన్నార

వేములవాడ టౌన్: గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలను శనివారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్ పరిశీలించారు. ఇందులో భాగంగా వేములవాడ మండలంలోని చీర్లవంచ, మారుపాక, చింతల్ ఠాణా గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవికుమార్ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వరసిద్ధి వినాయక ఆలయానికి వెండి కిరీటం బహూకరణ

సిరిసిల్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని బద్దం ఎల్లారెడ్డినగర్‌లో వరసిద్ధి వినాయక దేవాలయానికి శనివారం భక్తుడు రూ. రెండు లక్షల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించాడు. మెర్గు దశరథ్ చంద్రకళ దంపతులు తన కుమారుడు జన్మదిన సందర్భంగా కిరీటాన్ని స్వామివారికి సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నెహ్రూనగర్ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



ఉద్యానవనం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం క్షేత్రపర్యటనలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ ఉద్యానవనం, రైతు బజార్‌ను సందర్శించారు. ముందుగా విద్యార్థులు ఉద్యానవనంలో క్రీడా పరికరాలతో ఆడుతూ పాడుతూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం పక్కనే ఉన్న పట్టణ పోలీస్‌స్టేషన్‌తో పాటు రైతుబజార్‌లోని చాపలు, మేక, గొర్రెల మాంసం విక్రయాల దుకాణాలు, కూరగాయాల విక్రయాల దుకాణాలను, రైతు బజారు రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులను విద్యార్థులు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు పాసాల హరిప్రసాద్, ఉపాధ్యాయులు నందిని, లావణ్య, రజిత, వేదప్రకాష్, ప్రవళిక, చందన, కరుణ ఉన్నారు.

హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖాధికారి లక్ష్మీరాజం

తంగళ్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల హక్కులు, బాధ్యతలపై అవగహన పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమ శాఖాధికారి లక్ష్మీరాజం అన్నారు. శనివారం తంగళ్లపల్లి మంలం బద్దనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ మహిళల పట్ల జరుగుతున్న పరిణామలను వివరించారు. విద్యార్థులకు ప్రతి అంశంపై అవగహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కో ఆర్డినేటర్ రోజా, ఎంఈవో రాజునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



మర్రిపల్లిలో రైస్‌మిల్లులో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

వేములవాడ రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి) : మర్రిపల్లి గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లారీలను, రైస్‌మిల్లులోని ధాన్యం నిల్వలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే లారీలలోని ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు దించుకోవాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని యాజమాన్యానికి ఆదే శించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

వేములవాడలో పోలీసుల తనిఖీలు



ఆలయం వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

వేములవాడ టౌన్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా వేములవాడ పట్టణంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ పట్టణంలోని షాపింగ్ మాల్స్, బస్టాండ్, భీమేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారం ఆంజనేయ స్వామి దేవస్థానం, మసీదులు తదితర ప్రదేశాల్లో పోలీసు జాగిలాలతో నిశితంగా తనిఖీ చేశారు.వేములవాడ పట్టణంలో అనుమానాస్పద వస్తువులు, వాహనాలు, ప్యాకేజీ బ్యాగ్‌లు భద్రతకు ముప్పు కలిగించే వాటిని తనిఖీ చేశారు.

కాంగ్రెస్ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తాం

గంభీరావుపేట, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గాండ్ల బాలలక్ష్మి, నాయకులు ఎర్ర నర్సయ్య, బంగ్ల రాజు, నుషరత్, వేశాల వెంకటి, లింగం, గౌరిశంకర్, లక్ష్మీనా రాయణ, జంగ కాశీరాములు, శంకర్, ప్రబాకర్ తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఇల్లంతకుంటలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఇల్లంతకుంట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. మండంలోని ఇల్లంతకుంట, కందికట్కూర్ గ్రామాలలోని ప్రధాన వీధులగుండా శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రలోభాలకు గురై ఓటు వేయవద్దన్నారు. ఎన్నికలలో నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ప్రచారం చేపట్టాలని సూచించారు. అవాంచనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియపర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్‌సీఐ మొగిలి, ఎస్సైలు సిరిసిల్ల అశోక్, ఉపేంద్రాచారిలతో పాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఓటింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ప్రధానమని ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ అన్నారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా, ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు ముందు, పోలింగ్ ముగిసిన తర్వాత నిశితంగా పరిశీలించి, ఎన్నికలు జరిగిన తీరును పర్యవేక్షించి, నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళిని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, వారి విధులను పటిష్ఠంగా నిర్వహిస్తునే పోలింగ్ టీంలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందా లేదా, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎన్నికల నియమావళి అమలు, తదితర విషయాలను సూక్ష్మంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీపీవో షరీఫుద్దిన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఎల్‌డీఎం మల్లికార్జునరావు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ల ఏర్పాటు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికల విధులకు హాజరయ్యో అధికారులు, సిబ్బందికి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు పోస్టల్ నోడల్ అధికారి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులల్లో పాల్గొనే వారు నియామకపత్రం, ఫాం 14, ఎపిక్ కార్డు తీసుకుని తమ స్వంత మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎన్నికల అథారిటీకి సమర్పించాల న్నారు. ఆయా రిటర్నింగ్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్ వెంటనే జారీ చేస్తారని తెలిపారు. వెంటనే అక్కడే ఉన్న ఫెసిలి టేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియో గించుకోవచ్చన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలని లక్ష్మీరాజం కోరారు.

నామినేషన్ల పరిశీలన

ముస్తాబాద్, డిసెంబర్ 06 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 22 గ్రామపంచాయతీలకు మూడవ విడత నిర్వహించే ఎన్నికల నామినేషన్ల పరిశీలన శనివారం జరిగినట్లు ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. 22 గ్రామపంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులుగా 171 నామినేషన్లు రాగా సేవాలాల్‌తండా గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 21 గ్రామపంచాయతీలకు 170 నామినేషన్‌లు రాగా 105 మంది బరిలో నిలిచినట్లు తెలిపారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి ఒకటి తిరస్కరణకు గురైంది. అలాగే మండలంలో 202 వార్డు స్థానాలకు 545 నామినేషన్‌లు రాగా ముస్తాబాద్‌లోని ఒకటవ వార్డులో ఒక నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. 518మంది వార్డు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలిపారు.

ప్రజా భద్రతలో హోంగార్డుల ప్రాత కీలకం



హోంగార్డుకు ప్రశంసా ప్రత్రం అందిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శాంతి, ప్రజాభద్రతలలో హోంగార్డుల పాత్ర కీలకం, ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ మహేష్ బీగితే అన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకల సందర్భంగా హోంగార్డులు, సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌కు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ముఖ్య అతిధిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల పనితీరు ప్రశవసనీయమని ,హోంగార్డులు పోలీస్‌శాఖలో అంతర్గత భాగమని పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. హోంగార్డులకు చెందిన అధికారులు సిబ్బంది ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించాలని కోరారు. రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారీ, సీఐలు కృష్ణ, మొగిలి, నాగేశ్వర్‌రావు, రవి, అర్‌ఐలు మధుకర్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ తనిఖీ

బోయినపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సింగపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీలు చేసి రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు, వాహనాల తనిఖీలను పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించండంతో పాటు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్‌స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్ట రీత్యా తీసుకుంటామన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలందరూ ఈ నెల 21న నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత కోరారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. సిరిసిల్ల జిల్లా కోర్టు సముదాయంలో శనివారం జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత పోలీస్‌లు, అధికారులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించే కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ నెల 21న నిర్వహించే లోక్ అదాలత్‌లో కేసులను ఎక్కువగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జీ వేము లవాడ అజయ్‌కుమార్‌యాదవ్, డీఎస్పీ నాగేంద్రచారి, మేజిస్ట్రేట్‌లు ప్రవీణ్, సృజన, జ్యోతర్మయి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

రాజీమార్గమే రాజమార్గమని కుటుంబ కలహాల వల్ల పిల్లల మానసిక ఎదుగుదలకు ఆటంకం కలుగుతుందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయూర్తి పుష్పలత పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టులో శనివారం సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమన్వ య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారించడం ద్వారా ప్రజలు దీర్ఘకాలిక న్యాయప్రక్రియల నుంచి విముక్తి పొందుతారని అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, లోక్‌అదాలత్‌లో కేసులను పంపేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ సివిజ్ జడ్జి లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి వేములవాడ అజయ్‌కుమార్ జాదవ్, సిరిసిల్ల బార్ అసోషియేషన్ అధ్యక్షులు జూపెల్లి శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో గుంటపల్లిచెరువు తండా వాసి మృతి


రవి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాకు చెందిన గుగులోతు రవి(43) సౌదీలో గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామంలో రవి తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయంతో పాటు దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఐదేళ్లక్రితం రూ.2లక్షలు అప్పు చేసి ఖతార్ వెళ్లాడు. అక్కడ సరైన పనిదొరకక వెళ్లిన ఆరునెలలకే ఇంటికి చేరుకున్నాడు. రెండేళ్ల క్రితం మరో రూ.5లక్షలు బాకీ చేసి కూతురు వివాహం జరిపించాడు. అప్పు తీర్చేందుకు యేడాది క్రితం రూ.3లక్షలు అప్పుచేసి సందర్శక వీసాపై సౌదీ దేశానికి వెళ్లాడు. అక్కడిగదిలో అస్వస్థతకు గురైన ఆయనను తోటి స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి గుండెపోటుతో చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. శనివారం మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. మృతుడికి భార్య మంజుల, ముగ్గురు కూతుళ్ల స్రవంతి, చిట్టి, సోనా, కొడుకు దివాకర్ ఉన్నారు. కాగా భారత రాయబార కార్యాలయం, ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య


రాకేష్(ఫైల్)

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కాశెట్టి వాడకు చెందిన చెరుకు రాకేష్(33) అనేవ్యక్తి మానసిక వేదనకు గురై ఉరి వేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి ఎస్‌ఐ జి.మహేష్ కథనం ప్రకారం.. చెరుకు రాకేష్‌కు ఐదుసంవత్సరాల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రాకేష్ నాలుగు నెలల క్రితం కువైట్ దేశం వెళ్లి అక్కడ పని దొరక్క వారం రోజులకే ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటినుంచి ఆర్థికంగా నష్టపోయానని తరచూ బాధపడు తుండేవాడు. శనివారం మధ్యాహ్నం తన బంధువైన కాశెట్టి నాగరాజు షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలు దేరాడు. అనంతరం ఆ షాపులో ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుడి తండ్రి సత్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బోయినపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం బోయినపల్లి మండల పరిధిలోని రూసో కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జునైద్ మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే అవగాహన తప్పనిసరి అని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని అనుమానాస్పద లింకులు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా సైట్‌లను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా మోసం జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నేర్చుకున్న విషయాల్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో వాళ్ళకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, సంపత్, రాజ్ కుమార్, మౌనిక, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తొలగించని సిల్ట్..

● బురద నీటితో నిండిన మురికి కాలువ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామంలో బురద నీటితో మురికి కాలువలు అపరిశుభ్రంగా మారాయి. ఈ కారణంగా దోమలు వృద్ధిచెందాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయినా పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మురికి కాలువల్లో సిల్ట్ తొలగించి డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు. అనారోగ్యాల బారిన పడక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చెత్తతో అపరిశుభ్రంగా మారిన డ్రైనేజీ

నిఘా..జాగ్రత్త

● అమల్లోకి ఎన్నికల కోడ్
● నిఘా కోసం ప్రత్యేక బృందాలు



ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఫలితంగా అన్ని పార్టీల నాయకులు పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

● పాటించవలసినవి..

కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులు అధికారిక పర్యటనలో ఎన్నికల ప్రచారంగా ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. వాహనాలను అధికారిక పనులకే వినియోగించాలి. ఎవరైనా హోదాను దుర్వినియోగం చేస్తే అధికారిక వాహనాలను ఉపసంహరించుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా కూడా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని అధికారిక చర్చలకు కూడా పిలవకూడదు. స్థానిక ఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనకు వచ్చినా మంత్రులు అధికారులను పిలిస్తే వారు వెళ్తే నిబంధనలకు విరుద్ధంగానే భావించి ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

● ప్రచారంలో జాగ్రత్తలు వహించాలి

ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ, అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, పరస్పర ద్వేషభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. నిరాధర ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

బస్ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఈనెల 5వ తేదీన వేములవాడ మూలవాగు వంతెనపై ఆపి డ్రైవర్, కండక్టర్‌ను బెదిరించిన మూర్తి రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్‌ఐ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ సంఘటనపై ఆర్టీసీ కండక్టర్ బాలసాని స్వప్న, డ్రైవర్ మొగిలి వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపి బెదిరించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో కొలగాని రవి అనే మేకల కాపరికి చెందిన మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తూ విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందింది. శనివారం గ్రామరెవెన్యూ పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన కంచెవద్ద మేక మేత మేస్తుండగా విద్యుదాతానికి గురై మృతిచెందినట్లు బాధితుడు పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు రవి ప్రభుత్వాన్ని కోరాడు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్టు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని మోటారు వైండింగ్ దుకాణంలో చోరీకి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకుడు మోతె సంతోష్‌ను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. నిందితుడివద్ద నుంచి రూ.35వేల విలువైన బోరుమోటారు సామగ్రి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. వీర్నపల్లిలోని పర్లపల్లి బాబు దుకాణంలో నుంచి సంతోష్ వ్యవసాయ బోరు మోటారుతోపాటు సామగ్రిని ఎత్తుకెళ్లాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. చోరీ జరిగిన 24గంటల్లోనే నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ వివరించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ


చందుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ కోసం ఆత్మాహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి చేకూరాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చందుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కొరకు న్యాయం కావాలని కోరుతూ ఒక యువకుడు ప్రాణం తీసుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్,బీజీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు అమర బండ ప్రసాద్, నాయకులు వనపర్తి సతీష్, హమయ్య చారి, చిలక శ్రీనివాస్, మేడిశెట్టి జగన్, బత్తుల కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు


ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో జరిగిన బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో బాలబాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కొమురయ్య తెలిపారు. శనివారం జిల్లా నుంచి పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల బాలబాలికలు బబ్బిలి అక్షయ్, మాలేపు రిషికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవగా వారిని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై పోలీసుల కొరడా


పోలీసులకు పట్టుబడిన వాహనాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్స్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్ అధికారులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో సరైన నంబర్ ప్లేట్లు లేని 73 వాహనాలను గుర్తించారు. వాటి యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. జరిమానాలు విధించిన అనంతరం, ఆయా వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లను బిగింపజేసి పంపినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరులు రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

అభ్యర్థులందరికీ.. ఒకే గొంతు

● ప్రచారంలో సలీం గళం


వాయిస్ రికార్డింగ్ చేస్తున్న సలీం

సిరిసిల్ల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఆయన మైక్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ బలపరిచిన అభ్య ర్థులను గెలిపించాలని అంటారు.. స్వతంత్రులకు ఓటెయ్యండి అంటూ ప్రచారం చేస్తాడు... గొంతు ఒక్కటే అభ్యర్థులు, పార్టీలు వేరు.. ఈ గొంతుప్రస్తుతం తెలంగాణ పంచా యతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ఏప్రాంతంలోనైనా శాసన సభ, పార్లమెంట్ ఏ ఎన్నికల్లో అయినా మారుమోగుతూనే ఉంటుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వైసీపీ, బీఎస్పీ, జనసేన పార్టీలకు ఓటేద్దాం రండి అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన సలీం గొంతుతో ప్రచారం సాగుతుంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లోనూ వివిధ అభ్యర్థులకు ప్రచారం మొదలు పెటారు. అతను దాదాపు నాలుగు దశాబ్దాలుగా అందరు అభ్యర్థుల ప్రచారానికి ఆయన గొంతు అరువు ఇస్తూనేఉన్నాడు. సార్వత్రిక ఎన్నికలైనా.. స్థానిక ఎన్నికలైనా రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన ప్రచారకళాకారుడు ఎండీ సలీం గొంతు వినిపించాల్సిందే. సిరిసిల్లలోని లక్ష్మీ థియేటర్ రిక్షాలో కూర్చొని సినిమాల ప్రచారం కోసం 1974లో వినిపించిన సలీం గొంతు అందరినీ ఆకట్టుకుంది. సినిమా ప్రచారం, బీడీలు, లాటరీ టిక్కెట్లకు ఆయన ప్రచారం చేసేవారు. ఇలా సలీం గొంతు వివిధ కంపెనీల వారిని ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్ల అమ్మకాల ప్రచారంతో సలీం కంఠం రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. ఆడియో క్యాసెట్లు రావడంతో సలీం ప్రచారం మరింత ఊపందుకుంది. రాజమండ్రి పాలకోవా నుంచి హైదరాబాద్‌లో మార్కెట్లోకి విడుదలయ్యే వస్తువుల ప్రచారానికి సలీం గొంతునే ఉపయో గించేవారు. వాణిజ్య ప్రచారాల నుంచి సలీం గొంతు రాజకీయ పార్టీలకు చేరింది. అన్ని పార్టీల వారు తమ ఎన్నికల ప్రచారానికి, ఆందోళన కార్యక్రమాల ప్రచారానికి సలీం గొంతుతోనే ప్రచారం చేసుకుంటున్నారు. మాతృభాష ఉర్దూ అయినా సలీం తెలుగులో అనర్గళంగా మాట్లాడుతారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు చెన్నై, ముంబాయి, బీవండిలోనూ సలీం గొంతును ప్రచారానికి ఉపయోగించుకున్నారు. వృత్తి పరంగా రికార్డింగ్ సెంటర్, మైక్, టెంట్స్ సరఫరా చేసే సలీం, గాయకుడు ఘంటసాల గానం చేసిన పాటలను ఒక దగ్గర నిక్షిప్తం చేయాలన్న తపనతో ఘంటసాల కల్చరల్ ఆకాడమీ ఏర్పాటు చేశారు. 40ఏళ్లుగా ప్రచార రంగంలో తనకంటూ ఓ స్థానం కల్పించుకున్న సలీం ఆకాశవాణిలో ప్రత్యక్ష వాఖ్యానం, ఘంటసాల ఆలపించిన పాటలకు వ్యాఖ్యానం అందించారు. సలీం మైసూర్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు కళాజ్యోతి, కళాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలను సైతం అందుకున్నారు. ప్రస్తుత పంచా యతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఆయన గొంతును ప్రచారాలకు ఉపయోగించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ముస్తాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలక్ష్మణపల్లె వై జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు వెంకటయ్య, భార్య లక్ష్మీతోకలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వారు వాహనంపై నుంచి కిందపడి పోయారు. వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భార్యలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్నపేట పెద్దమ్మ ఆలయం మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లికి చెందిన దేవిరెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పడంతో ప్రమాదంజరిగింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడ్డ దేవిరెడ్డిని గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా అబ్బాయికుంట లేబర్ కాలనీకి చెందిన కొండబత్తుల అనిల్‌కుమార్ అతడి కుమారుడు కొండబత్తుల ప్రదీప్‌తో కలిసి శనివారం ఉదయం వేములవాడ, కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో తాడికల్ పెద్దమ్మతల్లి గుడి వద్ద లారీని ఓవర్టేక్ చేస్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా, అతడి కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేకచోట్ల అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు భవనాలు, ఇళ్లను నిర్మిస్తున్నారని అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి తమస్థలంలో వేరొకరు ఇళ్లు నిర్మిస్తున్నారని, తమపక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో, మరికొందరు నేరుగా కమిషనర్‌ను, టౌన్‌ప్లానింగ్ అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. రోజుల కొద్దీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు విసిగివేసారి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొందరికి నోటీసులు జారీచేయడం, మరికొందరి ఫిర్యాదులను పరిశీలించి తాత్కాలికంగా పనులు నిలిపివేయడం, కొందరి భవన నిర్మాణసామగ్రిని తీసుకొచ్చి ఆ తర్వాత వదిలిపెట్టడం మినహా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సమస్యను బట్టి ముడుపులు తీసుకొని నోటీసులిచ్చామని, చర్యలు తీసుకుంటామని సర్దిచెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జ్యోతినగర్‌కు చెందిన పీటర్ అనేవ్యక్తి తన నివాసాన్ని (2-10-1175) ఆనుకొని ఉన్న ఒకరు అనుమతులు, సెట్ బ్యాక్, పార్కింగ్ బహుళ అంతస్తు షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తనఇంటికి వెంటిలేషన్ లేకుండా పోతోందని ఆవేదన చెందాడు. 2025 జూన్ 23న మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాడు. దీంతో ఆయన టౌన్‌ప్లానింగ్ డీసీపీకి పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ ఎండార్స్ చేస్తూ ఆయనను కలువాలని సూచించారు.

కమిషనర్ వెంటనే స్పందించడంతో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, అయితే దాదాపు ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ, అధికారులచుట్టూ తిరుగు తున్నాచర్య తీసుకోలేదని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో వాపోయాడు. ఎన్నోసార్లు అధికారులను కలిసినా వారు న్యాయం చేయక పోగా ఫిర్యాదు చేసిన వ్యక్తికి సపోర్టు చేస్తుండడంతో భవన నిర్మాణం జరుగుతోందని, దీనితో తనతోపాటు ఇరుగుపొరుగు ఇళ్ళకు వెంటిలేషన్ లేకుండా పోతుందని తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాలపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరాడు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తానని తెలిపాడు. ఇలా ఎంతోమందికి జరుగుతున్న అన్యాయాలపై కమిషనర్ స్పందించి న్యాయం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● ఆందోళనలో ప్రయాణికులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలం దూలూరులో బొమ్మెనకు వెళ్ళే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లకిందట ఇక్కడ ఇళ్లులేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పెరగడం వల్ల జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇక్కట్లు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని లేదా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


దూలూరులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాలేజీ గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్


జిమ్ చేస్తున్న వాకర్స్

మంథని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి జిమ్‌లో వాకర్స్ వినియోగించుకునేలా అందుబాటులోకి తెచ్చారు. దీంతోవాకర్స్ ఉత్సాహంగా జిమ్ చేశారు. వాకింగ్, జాగింగ్ కోసం గ్రౌండ్‌వచ్చే వారికోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీసర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే ఈ జిమ్‌నుమంత్రి శ్రీధర్‌బాబుతో ప్రారంభోత్సవం చేయి స్తామన్నారు. ఓపెన్ జిమ్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ కోరారు.

భద్రాచలం, పాపికొండలకు ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల టూర్‌లో భాగంగా భద్రాచలం, పాపికొండలు వెళ్లేందుకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-2 డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన కరీంనగర్ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం పాపికొండలు బోటింగ్ అనంతరం అదే రోజు రాత్రి భద్రాచలం, పర్ణశాల దర్శనం అనంతరం అదే రాత్రి వరకు కరీంనగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.1800, రూ.1300 చొప్పున చార్జి ఉంటుందని, వివరాలకు 9398658062, 8978383084, 9182610182 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జిల పూజలు




ఆలయంలో నందీశ్వరుడి వద్ద న్యాయమూర్తులు

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో శనివారం హైకోర్టు జడ్జిలతోపాటు జిల్లాలోని పలు కోర్టుల జడ్జిలు పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ముఖ్యఅర్చకుడు వారిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. అనంతరం మల్లికార్జునస్వామి, రామాలయంలో అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు భద్రయ్య, పంచాక్షరి, సిబ్బంది వారిని సన్మానించి ఆలయ జ్ఞాపికలను అందజేశారు. హైకోర్టు జస్టిస్‌లు పుల్ల కార్తీక్, అలిశెట్టి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావు, జిల్లా జడ్జిలు సునీత, గణేష్, వెంకటేష్, సచిన్‌రెడ్డి, సరిత, మంజుల, భవాని, సుధ, సంధ్యారాణి అలాగే డీసీపీ రామిరెడ్డి, ఏసీపి గజ్జికృష్ణ, ఎస్‌ఐ దీకొండ రమేష్, వకీళ్ల ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవనానికి స్థల పరిశీలన..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్‌లో జిల్లా కోర్టు భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం హై కోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ సందర్శించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 1072లో కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, స్థలం వివరాలు, భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులను న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునిత కుంచాల, పెద్దపల్లి డీసీపీ రామిరెడ్డి ,పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య , ఏసీపీ గజ్జి కృష్ణ తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.



పంచాయతీల్లో కీలకం.. ఉప సర్పంచ్

పలు గ్రామాల్లో ఆ పదవికి డిమాండ్

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉప సర్పంచ్ స్థానం కూడా హాట్ కేక్ అవుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు నిస్తున్న పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ఉప సర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే గెలుపునకు పరిపూర్ణత సిద్ధిస్తుందని భావిస్తున్నాయి. ఇందుకోసం ఉప సర్పంచ్ స్థానాలపై ప్రధానంగా గురిపెడుతు న్నాయి. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌ను కూడా కైవసం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతి కూలతలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఉప సర్పం చ్‌కు చెక్ పవర్ ఉండడం ఈ పదవికి డిమాండ్‌ను పెంచింది. ఉప సర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యు లే అయినందు వల్ల ఈ వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి మద్దతు ఉన్న వారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

● వార్డు సభ్యులే కీలకం..

ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహాలు మార్చుకుంటున్నారు. సర్పంచ్ కాకపోయినా చెక్‌పవర్ ఉన్న ఉప సర్పంచ్ పదవిని దక్కించుకుందామని పథకాలు రచించుకుంటున్నారు. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ కావాలంటే వార్డు సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయించినట్లు సమాచారం. 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళా సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో ఉప స్పంచ్‌గా గెలుపొంది అధిపత్యం చేలాం ఖంచవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలి గిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగారు. పాలకవర్గ సమావేశాలకు సర్పంచ్ గైర్హాజరు అయిన సందర్భాల్లో ఉప సర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు.

● ఎన్నిక ఇలా...

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు సాయంత్రంలోగా వెలువడుతాయి. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉప సర్పంచ్‌గా పోటీ చేసేవారు ముందుగా నామినేషన్లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరికి సమాన ఓట్లు వస్తే టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

● చెక్ పవర్‌తోపాటు అధికారాలు ఉండడం కారణం

● ఉప సర్పంచ్ అధికారాలు

సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు పర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, సజావుగా జరిగేట్టు చూడడం, రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజా పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తాడు. గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తాడు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వేముల లక్ష్మీప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న వేముల లక్ష్మీప్రసాద్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు తొలి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (ఏడీఓపీ)గా వేముల లక్ష్మీ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం లక్ష్మీప్రసాద్ రాజన్నసిరిసిల్ల జిల్లా కోర్టులో అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వేముల లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ నేరస్థులకు శిక్షలు విధింపజేయడంలో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయం అత్యంత ముఖ్యమన్నారు. కేసుల దర్యాప్తు దశ నుంచి కోర్టు వాదనలు పూర్తయ్యే వరకు కలిసి పనిచేస్తే నేరస్తులకు కచ్చితమైన శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. లక్ష్మీ ప్రసాద్ నియమాకంపై కరీంనగర్ డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ డి.శరత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మంచికట్ల రాజేశం, మల్యాల ప్రతాప్ అభినందనలు తెలిపారు.

తెలంగాణను అగ్రగామిగా నిలుపుతాం

● మంత్రి పొన్నం ప్రభాకర్



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఆహ్వానపత్రికను అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ 2040 విజన్‌తో దేశంలోనే తెలంగాణను అగ్రగామి నిలుపుతామని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి గ్లోబల్‌సమ్మిట్ ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్‌గ్లోబల్ సమ్మిట్‌కి బండిసంజయ్‌ని ఆహ్వానించినట్లు చెప్పారు. పెట్టుబడులు, ఇండస్ట్రియల్ గ్రోత్‌ను తెలంగాణ సమ్మిట్‌ద్వారా సాధిస్తామన్నారు. పదేళ్లలో తెలంగాణ ఆర్థికంగా వెనకబడిందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. కేంద్రప్రభుత్వం పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎక్కువ నిధులు ఇస్తోందని, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

● సాయి ఈశ్వర్ మృతి బాధాకరం..

బీసీరిజర్వేషన్లపై సాయిఈశ్వర్ మృతి బాధాకరమని మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. ఇలాంటి బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని కోరారు. సాయి ఈశ్వర్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. ఎవరు ప్రేరేపించినా మీరు బలిపశువులు కావద్దని సూచించారు.

● కులగణనకు కట్టుబడి ఉన్నాం

కులగణనకు కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. 50శాతం రిజర్వేషన్ దాటరాదన్న కేసును సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నామన్నారు. బలహీనవర్గాల సోషల్‌జస్టిస్ విషయంలో కాంగ్రెస్ చాంపియన్‌గా ఉందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్నట్లు చెప్పారు. గ్రావ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడమంటే రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంమీద అందరంకలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. చలోడిల్లీ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం దద్దరిల్లేలా 50శాతంకోటఎత్తివేసేలా ఉద్యమించాలన్నారు. అంకుముందు చైతన్యపురిలోని మహాశక్తి ఆలయంలో పూజలుచేశారు. ఆయనవెంట ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ఆచార్య ఉమేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఉన్నతశిఖరాలకు ఎదగాలని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శనివారం యూనివర్సిటీ మైదానంలో యూనివర్సిటీస్థాయి అంతర్ కళాశాలలో పురుషుల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలనానరు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయని, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 10 నుంచి 14వరకు కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికచేశారు. ఓఎస్‌డీ హరికాంత్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, పీఆర్వో పీడీ విజయ్ కుమార్, వ్యాయామ అధికారులు దినేష్, నాగేశ్వర్‌రావు, శ్రీనాథ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దంపేట ఎన్నిక నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండ లం పెద్దంపేట గ్రామ పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను జారీ చేసింది. మొదటివిడత ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న పెద్దంపేట పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. పెద్దంపేట పంచాయతీకి సంబంధించి హైకోర్టులో కేసు ఉన్నందున 11న ఎన్నికను నిర్వహించవద్దని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 15న ఎన్నికపై తుదితీర్పు వెలువడనుండడంతో అప్పటివరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కోర్టు తీర్పును అనుసరించి అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయం ముందు భక్తులు

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహహోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి అలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయఅధికారులు పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం వాహనాలతో నిండిపోయింది.

రక్త సంబంధీకుల నుంచి చట్టపరమైన దత్తత



పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్త సంబంధీకుల నుంచి పిల్లలను దత్తత తీసుకోదలిస్తే చట్టబద్ధంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి రక్త సంబంధీకుల నుంచి 12నెలల బాబును చట్టపరమైన దత్తత తీసుకున్నారు. వీరికి కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారికార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) పర్వీన్, ఎల్‌పీవో రాజు, యం రాజ్ కుమార్, రమేష్, మిషన్ వాత్సల్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శనివారం జగిత్యాలలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో జిల్లాస్థాయి పీఎంశ్రీ స్కూల్స్‌స్పోర్ట్ మీట్ ముగింపు కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, జిల్లావిద్యాశాఖ అధికారి కె.రాములు పాల్గొన్నారు. జిల్లాలోని 16పీఎంశ్రీ స్కూ ల్స్‌కి నిర్వహించిన కబడ్డీ, కోకో, వాలీబాల్, ఫుట్బాల్ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి లోని పలు పోటీల్లో ప్రతిభ కనపరచి జిల్లాపేరును నిలబెడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చిప్ప సత్య నారాయణ, కొక్కుల రాజేష్, కోరుట్ల మహేష్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్, పెటాఅధ్యక్షుడు విశ్వప్రసాద్,పిడుగు భాస్కర్, కృష్ణప్రసాద్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



డ్రైనేజీపై ఏర్పడిన గొయ్యి

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో 6వ వార్డుకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ మీద నిర్మించిన రోడ్డు ఒకవైపు కూలి పెద్ద గొయ్యి ఏర్పడిరది. దీంతో ఈ వార్డుకు వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ దారి గుండా వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు ఈ డ్రైనేజీలో పడి వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సంఒదించి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



చేవెళ్లలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి వెంకటేష్

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో చేవెళ్లలో నిర్వహించిన ఇగ్నైట్-2025 సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి సత్తా చాటాడు. రాష్ట్రవ్యాప్తంగా 194మోడల్ స్కూళ్లు పాల్గొన్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెంకటేష్ అనే విద్యార్థి గైడ్ టీచర్ సందీప్‌రాజ్ సహాయంతో తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ మిషన్‌కు కన్సోలేషన్ బహుమతి సాధించాడు. రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించిన వెంకటేష్‌ను, గైడ్‌టీచర్ సందీప్‌రాజ్‌ను ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

సర్పంచ్ అభ్యర్థిపై ఫిర్యాదు

ఎలిగేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి ఏలేటి వెంకట్ రెడ్డిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ భాస్కర్ రావుకు శనివారం ఫిర్యాదు చేసినట్లు మరో సర్పంచ్ అభ్యర్థి బాసంపల్లి రాజేష్ తెలిపారు. ఏలేటి వెంకట్ రెడ్డి ఇప్పటికే సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు తానిపర్తి మోహన్ రావు, నాయకులు న్యాతరి పోచయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి వినోద్, సుజికి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇప్పపల్లి రైతులతో ఆర్డీవో సమావేశం



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లి రైతులతో శనివారం కోరుట్ల ఆర్‌డీఓ జీవాకర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహిలాచారు. సూరమ్మ చెరువు ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా రైతులు భూములు కోల్పోతున్న నేపథ్యంలో నష్ట పరిహారం చెల్లింపుకుగాను అవార్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ప్రభుత్వ భూవిలువ ప్రకారం ఎకరాకు రు.8.60లక్షలు చెల్లించడానికి నష్టపరిహారం విడుదల చేసిందని రైతులకు సూచించారు. కాగా బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రు. 50 లక్షలు ధర ఉందని ఆ ధర చెల్లించాలని ఆర్‌డీఓకు రైతులు వినతి పత్రం అందజేశారు. అయితే నిర్ణీత డబ్బులు కోర్టులో డిపాజిట్ చేసి పనులు ప్రభుత్వం ప్రారంభిస్తుందని రైతులతో ఆర్‌డీఓ చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, రైతులు ఉన్నారు.

మలి విడత పోరు ఫైనల్

(5వ పేజీ తరువాయి)

ప్రదీప్, బాలమల్లు పల్లె సర్పంచ్‌గా యాద ఎల్లయ్య, ఉప సర్పంచ్‌గా దొరగొళ్ల రాజు,గండిలచ్చపేట సర్పంచ్‌గా జంగిటి అంజయ్యలతో పాటు ఏకగ్రీవమయ్యారు. ఇల్లంతకుంట మండలంలో చిక్కుడువాని పల్లె సర్పంచ్‌గా కళ్యాణ్, తిప్పాపూర్ సర్పంచ్‌గా బొల్లవేణి మంజుల, కేసన్నపల్లి సర్పంచ్‌గా పోతరాజు చంటి, ముస్కాన్ పేట సర్పంచిగా కోమటి రెడ్డి భాస్కర్ రెడ్డి, గాలిపెల్లి సర్పంచ్ గా బద్దం శేఖర్ రెడ్డి, పత్తి కుంటపల్లె సర్పంచ్‌గా జుట్టు శేఖర్, కృష్ణారా వుపల్లె సర్పంచ్‌గా జక్కుల మల్లవ్వలతో పాటు వార్డుల న్నీ ఏకగ్రీవం అయ్యాయి. జంగం రెడ్డిపల్లి సర్పంచ్‌గా పండుగ సునీతతో పాటు నాలుగు వార్డులు ఏకగ్రీవమ య్యాయి. మూడో విడత ఈనెల 9 వరకు ఉపసంహర ణల గడువు ఉన్నప్పటికీ నామినేషన్ల పర్వం ముగిసే సమయానికి 7 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. గంభీరావుపేట మండలంలో లక్ష్మీపూర్ సర్పంచ్‌గా అంజయ్య, దేశాయిపేట సర్పంచ్‌గా జి పద్మ, వీరలాల్ తండా సర్పంచిగా భూక్య పద్మ, ముస్తాబాద్ మండలం లో సేవాలాల్ తండా సర్పంచ్‌గా భూక్య సరిత, ఎల్లారెడ్డిపేట మండలంలో రాగట్లపల్లి సర్పంచ్‌గా లక్ష్మయ్య, గుంటుపల్లి చెరువు తండా సర్పంచ్‌గా తిరుపతి, వీర్నపల్లి మండలం జహర్‌లాల్ నాయక్ తండా సర్పంచ్‌గా భూక్య హంసలతో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు.

పీఎంశ్రీ పాఠశాల విద్యార్థుల సందర్శన



గీతానగర్ పాఠశాల వద్ద విద్యార్థులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శని వారం సందర్శించారు. పాఠశాలలోని డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాల, గ్రంథాలయం, ఆర్ట్స్ గదిలను పరిశీలించారు. బడి సంస్కృతి, విద్యా వ్యవస్థపై అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు వివరిం చారు. సందర్శనతో రెండు పాఠశాలల మధ్య స్నేహం పెంపొందిచడం, నూతన విషయాలను నేర్చుకోవడం, సృజనాత్మకతను పెంపొందిచేందుకు దోహదపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉదయలక్ష్మీ, ఉపాధ్యాయులు రజిత, మౌనిక, ప్రవీణ, మనోజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మూలవాగులో రోడ్డు మరమ్మతు



మామిడిపల్లి-నిజామాబాద్ మూలవాగు

కోనరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు అధికారులు మూలవాగులో తాత్కాలిక మరమ్మ తులు చేపట్టారు. కోనరావుపేట మండలంలోని మూలవాగులో గతంలో నిర్మించిన కాజ్‌వేలు కొట్టుకుపోవడంతో పది సంవత్సరాల నుంచి అధికా రులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ఈ సంవత్సరం కూడా వరద తాకిడికి చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు కొట్టుకుపోయాయి. దీంతో నాలుగు నెలలుగా ప్రజలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మూలవాగులో నిజా మాబాద్, మామిడిపల్లి, బావుసాయిపేటలో, వెంకటరావుపేట, మట్టిమల్ల నిమ్మపెల్లి గ్రామాలను కలిపి మూలవాగులు తాత్కాలిక రోడ్డు మరమ్మ తులు చేపట్టాలని ఆదేశించడంతో కదిలిన యంత్రాంగం మామిడిపల్లి-నిజా మాబాద్ మూలవాగులో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో రవాణా సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో విభేదాలు సృష్టించవద్దు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై రమేష్

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగం గా గ్రామాల్లో విభేదాలు సృష్టించవద్దని చందుర్తి ఎస్ఐ జె. రమేష్ అన్నా రు. మండలంలోని సనుగుల, దేవునితండా గ్రామాల్లో ఎన్నికల నియమా వళిపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఓటరు నియమావళిని తప్పక పాటించాలన్నారు. నిబంధనలు, ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల పేరుతో గ్రామాల్లో వర్గాలు లేదా విభేదాలు సృష్టించడం పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. సామరస్య వాతావరణాన్ని కాపాడాలన్నారు. ఓటర్లు మద్యం, నగదు, ఉచితాల పంపిణీ లాంటి ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. ఉచితాల పంపిణీకి పాల్పడే వారిపై, ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా ఎన్ని కల సందర్భంలో విద్వేష పూరిత పోస్టులు లేదా అభ్యంతరకర కంటెంట్‌ను షేర్ చేస్తే, వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీ సుకుంటామన్నారు. నిష్పక్షపాతంగా, భయం లేకుండా ఓటు హక్కును విని యోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఏకగ్రీవ సర్పంచులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందనలు

తిమ్మాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజ కర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రెండో విడత నామినేషన్ల ఉప సంహరణ శనివారంతో ముగిసిందని, చాలా గ్రామాల్లో సర్పంచులు ఏకగ్రీవ మయ్యారని పేర్కొన్నారు. ఇల్లంత కుంటలో ఎనిమిది గ్రామాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవమైనట్లు పేర్కొన్నారు. కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ముస్కానిపేట), బొల్లం మంజుల-రమేష్ (తిప్పాపూర్), బద్దం శేఖర్ రెడ్డి(గాలిపల్లి), పండుగ అనిత-తిరుపతి (జంగంరెడ్డిపల్లి), జక్కుల మల్లవ్వ(కిష్టారావు పల్లి), జుట్టు శేఖర్(పత్తికుంట పల్లి), కంకటి కళ్యాణ్(చిక్కుడువానిపల్లె), పోతరాజు చంటి(కేశన్నపల్లి) ఉన్నట్లు తెలిపారు. గన్నేరువరం మండలం పీచుపల్లి నుంచి రాజిరెడ్డి, బెజ్జంకి మండలం నర్సింహులపల్లి జెట్టి రమేష్ ఏకగ్రీ వంగా ఎన్నికైనట్లు వెల్లడించారు.

ముగ్గురున్నా బరిలో...

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ఎన్నో ఏళ్లుగా పోటీ చేయాలని ఆసక్తి ఉన్నప్పటికీ ముగ్గురు సంతానం ఉన్న వారు పోటీ చేసేందుకు అవకాశం లేకపోయింది. రాజకీయ పార్టీల్లో సీనియర్ నేతలుగా ఉన్నప్పటికీ పోటీకి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు పిల్లలు ఉన్న వారు కూడా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సీని యర్లకు అవకాశం వచ్చింది. ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేతతో చందు ర్తి మండలంలో సర్పంచ్, వార్డు మెంబర్ బరిలో నిలిచారు.

అంబేద్కర్ విధానాలతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వేములవాడలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



ముస్తాబాద్‌లో అంబేద్కర్ వర్ధంతి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) స్వాతం త్ర్యం అనంతరం భారతదేశంలోని బడుగు బలహీన వార్గల అభివృద్ధి కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సంగీతం శ్రీనివాస్, గ్రంథాల యం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చట్ట సభలో ఈ రోజు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు అడుగుపెడు తున్నారంటే అంబేద్కర్ కల్పించిన అవకాశం అన్నారు. విద్యా, ఉద్యోగ రంగాలలో కూడా అవకాశాలు దక్కుతు న్నాయన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానాలతోనే జాతీ య కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదింప జేశాడని అన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూపిన దారిలోనే వెళ్తామన్నారు. అనం తరం నాయకులు ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. స్థానిక 35వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా యంగ్ మెన్స్ అంబేద్కర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా మార్కెట్ కమిటి డైరెక్టర్ దుబాల వెంకటేశం చేతుల మీదుగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మాజీ కౌన్సిలర్ రాగుల జగన్, నాయకులు రాగుల రాములు, ఎర్రం మల్లయ్య, తాటికొండ శ్రీనివాస్, అన్నల్ దాస్ భాను పాల్గొన్నారు.

వేములవాడలో...

వేములవాడ: వేములవాడ పట్టణంలో డాక్టర్ బీఆర్ అబేంద్కర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాజన్న ఆలయ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, బింగి మహేష్, పులి రాంబాబు తదితరులు ఉన్నారు. పదో వార్డు ఎస్సీ కాలనీలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అర్బన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సిరిగిరి చందు, మాజీ సెస్ డైరెక్టర్ రామ తీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, కందుల క్రాంతి, గోలి మహేష్, మారం కుమార్ తదితరులు ఉన్నారు. వేము లవాడ పట్టణంలోని బీసీ సాధికారిత కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సాధి కారిత రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని శనివారం వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, పొత్తూరు అనిల్‌కుమార్, పిట్టల మనోహర్ పాల్గొన్నారు

ఎల్లారెడ్డిపేట.. వీర్నపల్లి మండలాల్లో..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా ని ర్వహించారు. మండల కేంద్రాలతోపాటు గొల్లపల్లి, నా రాయణపూర్, హరిదాస్‌నగర్, పదిర, వెంకటాపూర్, బొప్పాపూర్, అల్మాస్‌పూర్, రాజన్నపేట, గర్జనపల్లి, వన్ పల్లి తదితర గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బల హీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయా లని అన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయ కులు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

సిరిసిల్ల టౌన్: బీఆర్ అంబేద్కర్ కన్న కలలను సహకారం చేయాలని గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, గ్రంథాలయం ఇంచార్జి కార్యదర్శి బీ శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో ..

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని విలీన గ్రామాలైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్ నగర్, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాల్లో శనివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌బీఆర్ అంబే ద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అయా గ్రామా ల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జల్గం ప్రవీణ్, నాయకులు పెద్దూరి తిరుపతి, మోర లక్ష్మీరాజం పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: మండల కేంద్రంలో, ఆవునూర్, గూ డెం, పోతుగల్, చీకోడ్, చిప్పలపెల్లి తదితర గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు, మాజీ సర్పంచ్‌లు, దళిత సంఘాల నాయకులు గ్రామ స్థులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట మండలంలో..

గంభీరావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు, అంబేద్కర్ సంఘం నాయకులు బిట్ల శ్రీనివాస్, లక్కం నాంపెల్లి, టేకుమల్ల రాజు, బర్కుటం తిరుపతి, రెడ్డిమల్ల రాజనర్సు, దోసల ఉపేందర్, సురేష్, శేఖర్, దేవయ్య తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట మండలంలో..

ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చిత్రపటా నికి శనివారం పూలమాలలువేసి నివాళులు అర్పించా రు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు తడక పెల్లి భూమయ్య, నాయకులు మంద రాజు, ఎలుక రా మస్వామి, సావనపెల్లి రాకేష్, మామిడి రాజు, కాసు పాక శంకర్, సురేష్, మామిడి తిరుపతిలతో పాటు వి విధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట మండలంలో..

కోనరావుపేట: మండల కేంద్రంలో అంబేద్కర్ యువ జన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, మాందాల శ్రీనివాస్, బత్తుల దీపక్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి మండలంలో..

చందుర్తి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ వర్ధంతిని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో శనివా రం ఘనంగా నిర్వహించారు. మేనేజర్ గుడిసె విజయ్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు.



ఇల్లంతకుంటలో నివాళులర్పిస్తున్న నాయకులు



కోనరావుపేటలో అంబేద్కర్ వర్ధంతి



చందుర్తిలో టీజీబీ సిబ్బంది నివాళి

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



మల్యాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



రుద్రంగిలో వసతులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్‌లో ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాల్లో కలింంచిన వసతులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు. చందుర్తి మండ లం మల్యాల గ్రామంలోని హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం హైస్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూను తనిఖీ చేశారు. ఆయన వెంట చందుర్తి ఎంపీఓ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

రుద్రంగి : గ్రామ పంచాయతీ ఎన్నికల నేప థ్యంలో మొదటి ఫేజ్‌లో ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన వసతులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు. రుద్రంగిలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలించి, అధికా రులకు పలు సూచనలు చేశారు. తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులపై ఆరా తీశారు. పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రుద్రంగిలో ఎస్ఎస్ టీ చెక్ పోస్టును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.పరిశీలనలో రుద్రంగి తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్ పంతం రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం కార్మిక భవనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలంటూ ఆత్మహత్యకు పాల్పడిన సాయి ఈశ్వరచారి ఆత్మ శాంతించాలని కోరుకుంటూ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం బీసీ హక్కుల సాధన సమితి సమావేశంలో రవి మాట్లాడాడు. సాయి ఈశ్వరచారి మరణానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మం డలం ఎల్లమ్మగూడెం సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి నాగలక్ష్మి భర్త యాదగిరియాదవ్‌పై సమాజం తలదించుకునే విధం గా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రవర్తించాడని ఆరోపించారు. మంత్రి పదవి నుంచి ఆయనను భర్తరఫ్ చేయాలన్నారు. సమా వేశంలో బీసీ సంఘ నాయకులు సోమ నాగరాజు, మీసం లక్ష్మన్, సదానందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్ రవి

గ్రామాల్లో సందడిగా పంచాయతీ ఎన్నికలు

తంగళ్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు గ్రామాల్లో సందడి తీసుకువచ్చాయి. ఎక్కడ చూసినా ఎన్నికలపై చర్చ నడుస్తోంది. తొలి విడత గ్రామాల్లో ప్రచారం, రెండో విడత గ్రామాల్లో ఉపసంహ రణలు పూర్తయ్యాయి. మూడో విడత నామినేషన్ల పరిశీలన పూర్తయింది. తంగళ్లపల్లి మండలంలో ఉప సంహరణల అనంతరం సర్పంచ్ పదవికి 107 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే 371 మంది అభ్య ర్థులు వార్డు సభ్యుల బరిలో ఉన్నారు. ఎన్నికల అధికా రులు బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయిం చారు. కాగా తంగళ్లపల్లిలో సర్పంచ్ అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులో అక్షర క్రమంలో లేవని లేవని సర్పంచ్ అభ్యర్థి లేవనెత్తడంతో కొద్ది సేపు గందరగోళం ఏర్పడింది. చివరకు ఎన్నికల అధికారి నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించారు. ఈ విషయంపై అభ్యర్థి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్‌కు పిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

మూడు సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

తంగళ్లపల్లి మండలంలో మూడు గ్రామ సర్పంచ్‌ల పదవులు, రెండు ఉప సర్పంచ్‌లు, 78 వార్డులు ఏకగ్రీవ మైనట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ ప్రకటించారు. వేణుగో పాల్‌పూర్ సర్పంచ్‌గా జుపెల్లి రమాదేవి, బాలమల్లుపల్లె సర్పంచ్‌గా యాద ఎల్లయ్య, గండిలచ్చపేట సర్పంచ్‌గా జంగిటి అంజయ్యలు ఏకగ్రీవం అయ్యారు. అలాగే బాల మల్లుపల్లె ఉప సర్పంచ్‌గా దొరగళ్ల రాజు, వేణుగోపాల్ పూర్ ఉప సర్పంచ్‌గా లింగంపెల్లి ప్రదీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇల్లంతకుంటలో ఎనిమిది సర్పంచ్‌ల ఏకగ్రీవం





ఇల్లంతకుంట: గ్రామపంచాయతీ ఎన్నికలలో పలు గ్రామాల సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలు ఏకగ్రీవం అ య్యాయి. మండలంలో 35సర్పంచ్ స్థానాలు ఉండగా 8 గ్రామాలలో 294వార్డుసభ్యుల స్థానాలు ఉండగా 104 స్థా నాలు ఏకగ్రీవం అయ్యాయి. సర్పంచ్ బరిలో 79మంది, వార్డుసభ్యుల స్థానాల బరిలో 454మంది పోటీలో ఉన్నా రు. మండలంలోని 11 ఆర్‌ఓ కేంద్రాలలో శనివారం పలు గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నా రు. సమయం మించిపోయిన తర్వాత నలుగురు వార్డుస భ్యుల అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకోవడానికి వచ్చినా అధికారులు అంగీకరించకపోవడంతో వెనుదిరిగా రు. ఏకగ్రీవం అయిన సర్పంచ్‌లలో చింతమడక కళ్యాణ్ (చిక్కుడువానిపల్లె), బొల్లవేని మంజుల(తిప్పాపూర్), పోతరాజు చంటి(కేసన్నపల్లె), కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ముస్కానిపేట), బద్దం శేఖర్‌రెడ్డి(గాలిపెల్లి), పండుగ సునిత (జంగంరెడ్డిపల్లె), జక్కుల మల్లవ్వ (కిష్టరావుప ల్లె), జుట్టు శేఖర్ (పత్తికుంటపల్లె) గ్రామాలు ఉన్నాయి. ఏకగ్రీవం అయిన 7సర్పంచ్ స్థానాలలో అన్నివార్డులు కూడా ఏకగ్రీవం కాగా జంగంరెడ్డిపల్లె గ్రామంలో మా త్రం 4వార్డులు మాత్రమే ఏకగ్రీవం కాగా మరో 4వార్డుస భ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఏకగ్రీవం అయిన గ్రామాలలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీచే సి సంబరాలు నిర్వహించారు.

ముగిసిన నామినేషన్ పత్రాల పరిశీలన

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని 43 సర్పంచ్, 358 వార్డు స్థానాలకు దాఖ లైన నామినేషన్ పత్రాల పరిశీలన శనివారం ముగిసింది. ఎల్లారెడ్డిపేట మండలంలో 26 సర్పంచ్‌లకు 142, 226 వార్డులకు 542 మంది పోటీలో ఉన్నారని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. వీర్నపల్లి మండలంలో 17 సర్పంచ్‌లకు 87, 132 వార్డులకు 219 మంది బరిలో ఉన్నారని ఎన్నికల అధికారి, ఎంపీడీవో శ్రీలేఖ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లి చెరువుతండా, రాగట్లపల్లి, వీర్నపల్లి మండలంలోని జవ హర్‌లాల్‌నాయక్‌తండా పంచాయతీల సర్పంచ్‌లతో పాటు వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖల య్యాయని అధికారులు తెలిపారు. ఆ గ్రామాలు ఏకగ్రీ వం కానున్నాయి. సర్పంచ్‌లుగా భూక్య తిరుపతి, నెత్తెట్ల లస్మయ్య, భూక్య హంసబాయిల ఎన్నిక ఖరారైంది.

6 వార్డు స్థానాల్లో ఒకే నామినేషన్

ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవునిగుట్టతండా సర్పం చ్ స్థానానికి 5 నామినేషన్లు, 6 వార్డు స్థానాలకు 6 దాఖ లయ్యాయి. సర్పంచ్‌కి నలుగురు పోటీలో ఉండగా 6 వార్డు స్థానాల్లో ఒకే నామినేషన్ దాఖలైంది.

కుటుంబీకులను పోటీలో నిలిపిన నాయకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యో తి): ఎన్నికల్లో పోటీచేయాలని అనేక రోజులు గా ప్రయత్నాలు చేసినా రిజర్వేషన్లు అనుకూ లించకపోవడంతో వివిధ పార్టీల నాయకులు కుటుంబీకులను ఎన్నికల బరిలో నిలిపారు. ఇల్లంతకుంట మండలంలో 35 సర్పంచ్ స్థా నాలు, 294వార్డుసభ్యుల స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లతో తమకు అవకాశం రాలేదని పలువురు నాయకులు ని రాశకు లోనయ్యారు. కందికట్కూర్ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించగా మాజీ ఏఎ మ్‌సీ చైర్మన్ వేణురావు తన తల్లిని, నర్సక్క పేట గ్రామం జనరల్ మహిళకు కేటాయించ గా బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెం ద్రం తిరుపతిరెడ్డి తన తల్లిని పోటీలలో నిలి పారు. సోమారంపేట గ్రామంలో మాజీ మం డల రైతుబంధు అధ్యక్షుడు రాజిరెడ్డి తన భా ర్యను, ఓగులాపూర్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కేశవరెడ్డి తన స తీమణిని, పెద్దలింగాపూర్ గ్రామంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి గన్నా రం నర్సయ్య తన సతీమణి, రహీంఖాన్‌పేట గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కముటం రాములు తన భార్యతో నామినేష న్లు వేసి ప్రత్యర్థులతో పోటీపడుతుండగా, తి ప్పాపూర్ గ్రామంలో బొల్లవేని రమేష్ తన భార్య మంజులను పోటీలో నిలిపి ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఎన్నికలతో గ్రామాల్లో సందడి నెలకొంది. నాయకులు తమ కుటుం బీకులను పోటీలో నిలిపినా గెలుపుకోసం ము మ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.